
సాక్షి ఒడిశా

గురువారం । 3। ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 3,08,120లు, బంగారం 850 మిల్లీగ్రాములు, వెండి 31 గ్రాముల 950 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రెండు దోపిడీ ముఠాలు అరెస్టు

- 8లో.



అక్రమాలపై విజిలెన్స్‌కు ఫిర్యాదు

- 8లో.

న్యూస్‌రీల్

గోపాల్‌పూర్ ఐఐసీగా బిబేక నందా



బరంపురం: బరంపురం పోలీసు జిల్లా పరిధిలోని గోపాల్‌పూర్ పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారిగా 2012 బ్యాచ్‌కి చెందిన బిబేక నందా స్వాంయి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు కొందమాల్ జిల్లా రైకియా పోలీసుస్టేషన్ ఐఐసీగా ఆయన పనిచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గోపాల్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పర్యవేక్షణ సక్రమంగా ఉండేలా చూస్తానని తెలియజేశారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ఆందోళన



ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్తున్న బీకేఎంయూ నాయకులు, కార్యకర్తలు

పర్లాకిమిడి: పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ భారత్ ఖేత్ మజ్దూర్ సంఘ్, సీపీఐ పార్టీ నేతృత్వంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు జొన్న సుభాష్‌చంద్రరావు మాట్లాడుతూ.. పక్కా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు పీఎం ఆవాస్ యోజన పథకం కింద నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నెలవారీ వృద్ధాప్య, వితంతు పింఛన్ రూ.500 నుంచి రూ.5 వేలకు పెంచాలని, పట్టణంలో రోడ్లు, కాలువల మరమ్మతులు చేపట్టాలని కోరారు. అదేవిధంగా బీసీలకు ఒక కుటుంబానికి ఏడాదికి రూ.18 వేలు మంజూరు చేయాలని, ఇంటింటికీ రేషన్ అందజేయాలని, కరెంటు బిల్లులు 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని విన్నవించారు. అనంతరం 15 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏడీఎం రాజేంద్ర మంజీకు అందజేశారు. ఆందోళనలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి అభయ సాహు, కామేశ్వర బెహరా, శ్రీకాకుళం జిల్లా సీపీఐ అధ్యక్షుడు లక్కోజు శ్రీనివాసరావు, పద్మ, ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

విరిగిన కొండ చరియలు



రోడ్డుపైకి దొర్లిన కొండ చరియలు

భువనేశ్వర్: రాష్ట్రంలో కుండపోత వర్షాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బుధవారం కెంజొహర్‌లో కొండ చరియలు విరిగి పడి రోడ్డు మీదకు దొర్లాయి. అదృష్టవశాత్తు ఈ మార్గంలో వెళ్తున్న వాహనాలకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. అయితే వాహనాల రాకపోకలకు మాత్రం ఇబ్బందులు తలెత్తాయి.

వర్షాలపై మంత్రి ప్రమీల సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ప్రమీల మల్లిక్

భువనేశ్వర్: రాష్ట్ర రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి ప్రమీల మల్లిక్ వివిధ జిల్లాల్లో భారీ వర్షాల పరిస్థితిపై బుధవారం సమీక్ష నిర్వహించారు. స్థానిక రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రంలో ప్రత్యేక సహాయ కమిషనర్ మరియు ఇతర సీనియర్ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. విపత్తు నేపథ్యంలో చేపట్టిన సన్నద్ధత చర్యలు, టీముల విస్తరణపై కలెక్టర్లతో మాట్లాడారు. పలు ప్రాంతాల్లో తాజా వర్షపాతం విశ్లేషించారు.

ప్రాంతం	వర్షపాతం (మిల్లీ మీటర్లు)
రౌర్కెలా	90.8
బౌద్	87.0
టిట్లాగఢ్	62.8
సోన్‌పూర్	49.0
సంబలపూర్	47.2
అంగుల్	44.0
బొలంగీరు	44.0
తాల్చేరు	42.0
ఫుల్బాణి	41.2
ఢెంకనాల్	41.0
నయాగడ్	35.0
కటక్	33.4
ఖుర్దా	31.0
భువనేశ్వర్	23.0

వీడని వాన



పర్లాకిమిడి: కాశీనగర్ వద్ద ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వంశధార నది

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న అధికారులు
- పలుచోట్ల జోరందుకున్న ఖరీఫ్ పనులు

అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల నదుల్లోకి భారీగా వర్షపు నీరు చేరుతుండడంతో గ్రామాలకు వరద ముంపు పొంచివుంది. రహదారులపైకి వర్షపు నీరు చేరుతుండడంతో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. నదుల్లో వరద ఉద్ధృతి పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలిస్తూ అప్రమత్తం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల సక్రమంగా వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ పనులు జోరందుకున్నాయి. – సాక్షి నెట్‌వర్క్



బరంపురం: పురుషోత్తపురంలో వరినారు తీస్తున్న రైతులు



బరంపురం: దుక్కు చేస్తున్న రైతులు



పర్లాకిమిడి: వరద ముంపుపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తదితరులు



బరంపురం: నాట్లు వేసేందుకు వరినారు తీసుకెళ్తున్న రైతులు



రాయగడ: వర్షాలకు ఒకవైపు కూలిపోతున్న కల్యాణ సింగుపూర్‌లోని వంతెన

అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్లకు ఎస్ఆర్‌సీ సత్యబ్రత సాహు సూచన
- వర్షాలపై సమీక్ష



వర్షాలపై సమీక్ష నిర్వహిస్తున్న ఎస్ఆర్‌సీ సత్యబ్రత సాహు

భువనేశ్వర్: రాష్ట్రమంతటా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) సత్యబ్రత సాహు సూచించారు. ఈ మేరకు అంగుల్, బాలాసోర్, బర్‌గడ్, బౌధ్, భద్రక్, బొలంగీర్, ఢెంకనాల్, గజపతి, జాజ్‌పూర్, ఝార్సుగుడ, కంధమల్, కెంజొహర్, కలహండి, మయూర్‌భంజ్, నువాపడా, సువర్ణపూర్ మరియు సంబల్‌పూర్ జిల్లా కలెక్టర్లతో బుధవారం సమీక్ష నిర్వహించారు. విపత్తు పొంచి ఉన్న ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలతో జిల్లా యంత్రాంగం సన్నద్ధం కావాలని ఆదేశించారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు, జల దిగ్బంధం వంటి విపత్కర పరిస్థితుల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభావిత ప్రదేశాలల్లో క్షేత్రస్థాయిలో వ్యూహాత్మకంగా సహాయక, పునరుద్ధరణ, పునర్నిర్మాణ కార్యకర్తలను ఉంచాలని సూచించారు. వర్షపు నీటి ముంపు ఉన్న తీర, లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం కల్పించాలన్నారు.

బాధితులకు ఆహారం అందించాలి

వరద బాధిత ప్రజలకు పొడి, వండిన ఆహారం, తాగునీరు అందించాలని ఎస్ఆర్‌సీ కమిషనర్ ఆదేశించారు. జిల్లా ప్రధాన ఆస్పత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా పాముకాటు సత్వర చికిత్స మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. అవసరమైతే స్థానిక అగ్నిమాపక సేవల బృందాలు మరియు పట్టణ, నగర పాలక సంస్థల అధికారులు నీటిని తొలగించి, నేలకూలిన చెట్లను తొలగించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా అవసరమైతే పాఠశాలలు, అంగవాడీ కేంద్రాలను మూసివేయాలని నిర్ణయించుకునే స్వేచ్ఛను ప్రాంతీయ జిల్లా కలెక్టర్లకు కల్పించారు. రోడ్లపై పారుతున్న వర్షపు



రంగంలోకి దిగిన సహాయక బృందాలు

నీరు తొలగించి వాహనాల రాకపోకలను జాగ్రత్తగా నియంత్రించాలని ప్రత్యేకంగా సూచించడం విశేషం. బౌధ్, మయూర్‌భంజ్, సోన్‌పూర్, అంగుల్, బొలంగీర్, కంధమల్, సంబల్‌పూర్, జాజ్‌పూర్ మరియు భద్రక్‌లో గాలింపు మరియు సహాయక చర్యలకు బృందాలను మోహరించాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ అండ్ ఎమర్జెన్సీ సర్వీసెస్‌ని కోరారు. రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తూ, ఒడిశా విపత్తు స్పందన చర్యల దళం ఒడ్రాఫ్ బృందాలను గాలింపు మరియు సహాయక సంబంధిత విధుల కోసం కెంజొహర్ మరియు సంబల్‌పూర్ ప్రాంతాలకు తరలించారు. జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలను భద్రక్, జాజ్‌పూర్‌లకు తరలించి మోహరించారు. జలవనరుల శాఖ అధికారుల సమక్షంలో నదీ వ్యవస్థలు మరియు రిజర్వాయర్ల ప్రస్తుత స్థితిపై సమీక్షించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు అప్రమత్తంగా ఉంచాలని జలవనరుల శాఖను ఆదేశించారు.



సేవలకు సన్నద్ధమైన ఒడ్రాఫ్ దళం

ఇంజిన్‌పై దొర్లిన కొండ రాళ్లు

- పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

భువనేశ్వర్: అంగుల్ జిల్లా హండపా మరియు బౌండా మధ్య బుధవారం గూడ్స్ రవాణా రైలు పట్టాలు తప్పింది. కొండపై నుంచి బండరాళ్లు ఇంజిన్‌పై పడడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో తాల్చేర్ నుంచి సంబల్‌పూర్ మధ్య రైలు మార్గంలో రైళ్ల రవాణాకు అంతరాయం ఏర్పడింది. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో సరుకు రవాణా రైలు పట్టాలు తప్పింది. సమాచారం అందడంతో రైల్వే సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని పునరుద్ధరణ పనులు చేపట్టారు. గత 48 గంటలుగా ఈ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కారణంగా కొండపై నుంచి బండరాళ్లు వదులై రైలు పట్టాలపైకి దొర్లినట్లు భావిస్తున్నారు. తాల్చేర్ నుంచి శారదా ముండా సమీపంలోని సంబల్‌పూర్‌కు సరుకు రవాణా రైలు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి హాని జరగలేదు.



పట్టాలు తప్పిన దృశ్యం



పట్టాలపై జారిన కొండ రాళ్లు

రాష్ట్రానికి రెడ్ అలర్ట్

- అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు
- ఉత్తర కోస్తాలో బలమైన గాలులు

భువనేశ్వర్: పశ్చిమ బెంగాల్ తీరంలో అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. జార్ఖండ్ మీదుగా పశ్చిమ–వాయువ్య దిశగా కదిలి రానున్న 12 గంటల్లో అల్పపీడనంగా బలహీన పడుతుందని వెల్లడించారు.

భారీ వర్షాలు

సుందర్‌గఢ్, ఝార్సుగుడ, బర్‌గడ్, బొలంగీర్, సోన్‌పూర్, సంబల్‌పూర్, దేవ్‌గఢ్, అంగుల్, కెంజొహర్, బౌధ్ జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు (7 నుండి 20 సెంటీ మీటర్లు) కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రెడ్ అలర్ట్ జారీ చేసింది. గురువారం ఉదయం 8.30 గంటల వరకు సుందర్‌గఢ్, ఝార్సుగుడ, బర్‌గడ్, బొలంగీర్, సోన్‌పూర్, సంబల్‌పూర్ ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షపాతం (20 సెంటీమీటర్లు పైబడి) కురిసే సంకేతాలను ఈ శాఖ జారీ చేసింది. ఢెంకనాల్, మయూర్‌భంజ్, నువాపడా, కలహండి, కంధమల్ ప్రాంతాల్లో ఒకటి లేదా రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు (7 నుండి 20 సెంటీమీటర్లు వరకు) కురిసే సంకేతంతో ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. బాలాసోర్, భద్రక్, కటక్, నయాగడ్, నవరంగ్‌పూర్, జాజ్‌పూర్ జిల్లాలలో ఒకటి లేదా రెండు ప్రదేశాల్లో 7 నుంచి 11 సెంటీ మీటర్లు వరకు భారీ వర్షపాతం కురుస్తుంది. ఇది నదుల నీటిమట్టం గణనీయంగా పెరగడానికి దారితీయవచ్చని పేర్కొంది. దీంతో లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు నీటమునిగే అవకాశం ఉందని పేర్కొంది.

గాలుల హెచ్చరిక

బుధవారం సాయంత్రం వరకు ఉత్తర బంగాళాఖాతం మరియు దానిని ఆనుకుని ఉన్న బంగ్లాదేశ్ – పశ్చిమ బెంగాల్ తీరాల మీదుగా గంటకు 45–55 కిలో మీటర్ల నుంచి 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినట్లు తెలియజేసింది. తదుపరి 6 గంటల్లో 35–45 కిలోమీటర్ల నుంచి 55 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. అనంతరం గాలుల తీవ్రత క్రమంగా తగ్గుతుంది. ఒడిశా తీరం వెంబడి మరియు వెలుపల, చురుకైన గాలుల వేగం 40–50 కిలో మీటర్ల నుంచి 60 కిలో మీటర్ల వరకు వీచే అవకాశం ఉంది. తర్వాత 12 గంటల్లో 35–45 కిలో మీటర్ల నుంచి 55 కిలో మీటర్ల వేగానికి తగ్గుతుంది. ఉత్తర కోస్తా ఒడిశా మరియు మయూర్‌భంజ్, అంగుల్, ఢెంకనాల్, కెంజొహర్, సుందర్‌గఢ్ ప్రాంతాల్లో పగటి పూట బలమైన ఉపరితల గాలులు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ ముందస్తు సమాచారం తెలిపింది.



వరద నీటిలో సహాయక చర్యలు చేపడుతున్న దృశ్యం

సముద్ర అలజడి

ఉత్తర బంగాళాఖాతం మరియు దానిని ఆనుకుని ఉన్న బంగ్లాదేశ్–పశ్చిమ బెంగాల్–ఉత్తర ఒడిశా తీరాల మీదుగా సముద్రం అల్లకల్లోలంగా ఉంటుంది. ఆ తర్వాత 12 గంటల పాటు సముద్ర పరిస్థితులు మోస్తరు నుంచి అల్లకల్లోలంగా ఉండవచ్చు. రానున్న 24 గంటల్లో ఒడిశా తీరం, బంగాళాఖాతంలో చేపల వేటకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచన జారీ అయింది.

ఓడ రేవులకు హెచ్చరిక

రాష్ట్రంలో అన్ని ఓడరేవులకు స్థానిక హెచ్చరిక (ఎల్‌సీ) సిగ్నల్ నంబర్–3 (ఎల్‌సీ–3) ఎగురవేశారు. గురువారం సుందర్‌గఢ్, ఝార్సుగుడ, బర్‌గఢ్ ప్రాంతాల్లో ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షపాతం (7 నుండి 11 సెంటీ మీటర్లు) కురిసే అవకాశం ఉంది. రాష్ట్రం మారుమూల ప్రాంతాల్లో చాలా చోట్ల మరియు కోస్తా జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

భూకబ్జా కేసులో ముగ్గురు అరెస్టు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి రాజుల కొండ గ్రామంలో భూకబ్జా కేసులో ముగ్గురు వ్యక్తులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని ప్రభుత్వ భూమిలో చిత్రకొండ సమితి సీపీఐ నేత హల్‌ధర్ పూజారి, పెప్పర మెట్ల పంచాయతీ రూమా గ్రామానికి చెందిన జయరామ్ టంగులు, మిన ఖోరలు అక్రమంగా పండ్ల తోటలను సాగు చేశారు. 2021లో ఈ భూములను 100 మందికి పైగా గిరిజనుల పేరున మారుస్తామని నమ్మించి స్వాభిమాన్ ఏరియాకు చెందినవారి నుంచి నిందితులు డబ్బులు వసూలు చేశారు. అయితే ఈ ప్రభుత్వ భూమిని ఖాళీ చేయమని అధికారులు నోటీసులు జారీ చేసినా పట్టించుకోకపోవడంతో, బుధవారం వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

అర్చన నాగ్‌కు బెయిల్ మంజూరు

భువనేశ్వర్: స్థానిక ఖండగిరి పోలీసుస్టేషన్‌లో అర్చన నాగ్‌పై నమోదైన దోపిడీ కేసులో ఒడిశా హైకోర్టు బుధవారం ఆమెకు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ మంజూరు సందర్భంగా జరుగుతున్న విచారణకు పూర్తిగా సహకరించాలని, సాక్ష్యులను ప్రభావితం చేయరాదని హైకోర్టు ఆదేశించింది. ఆమె విచారణకు సంబంధించి బయట ఎలాంటి వ్యాఖ్యలు, అభిప్రాయాలు వ్యక్తం చేయకూడదని స్పష్టం చేసింది. ఇంతకుముందు నయాపల్లి పోలీసుస్టేషన్‌లో దోపిడీ ఆరోపణలపై అర్చన నాగ్‌పై నమోదైన కేసులో సైతం కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈడీ కేసులో ఆమె జైలులోనే కొనసాగాల్సి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది.

క్లుప్తంగా

నూతన పోలీసుస్టేషన్ ప్రారంభం



పోలీసుస్టేషన్ ప్రారంభిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి కేంద్రంలో నూతన పోలీసుస్టేషన్‌ను ఎస్పీ తాపాన్ కుమార్ రౌత్ చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ముఖ్యంగా ఇక్కడ ఎటువంటి సమస్య వచ్చినా బలిమెల లేదా మల్కన్‌గిరి వెళ్లాల్సి ఉంటుంది అందువలన పోలీసుస్టేషన్ ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వ భవనం లేకపోవడంతో ఒక గదిలో స్టేషన్ ఏర్పాటు చేశారు. కోరుకొండ, తూమ్సాపల్లి, మరివాడ, దుడుమేట్ల, గోరఖోంట, కమ్‌బేడ, పోట్రేల్, తర్లకోట్ల, చింతలవాడ పంచాయతీలు ఈ స్టేషన్ పరిధిలోకి వస్తాయి. త్వరలోనే నూతన భవనం ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలియజేశారు. కార్యక్రమంలో కోరుకొండ సమితి అధ్యక్షుడు జితు బురిడి, మల్కన్‌గిరి ఎస్‌డీపీవో సచిన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



మాట్లాడుతున్న కమాండర్ వీపీ సింగ్

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి సమిమ్ గ్రామంలో బీఎస్‌ఎఫ్-2 బెటాలియన్‌కు చెందిన జవాన్లు ఒడిశా స్కిల్ డవలప్‌మెంట్ ఆథారిటీ ఆధ్వర్యంలో యువతకు ఉపాధి మరియు నైపుణ్యాభివృద్ధి శిక్షణ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెటాలియన్ కమాండర్ వీపీ సింగ్ మాట్లాడుతూ.. యువతలో ఉన్న ప్రతిభను ప్రతిఒక్కరూ గుర్తించాలని సూచించారు. యువత అభివృద్ధి చెందితే గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తాయని పేర్కొన్నారు. శిక్షణలో మొత్తం 158 మంది యువత పాల్గొన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ రెండో కమాండర్ సికింధర్ సింగ్, మల్కన్‌గిరి బీఎస్‌ఎఫ్ డిప్యూటీ కమాండర్ శుధంజాన్ మహాపాత్రో, సర్పంచ్ పూతాన్ హిరాయ్యా, మత్తిలి సమితి ప్రాజెక్ట్ మేనేజర్ బిపన్ కుమార్ ఖుర, ప్రభుత్వ పాలిటెక్నిక్ చైర్‌పర్సన్ శ్వాతి రౌత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాద స్థలంలో లక్ష్మణ్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి నాయక్‌గూఢ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం రాత్రి బైక్‌పై లక్ష్మణ్ భుమియ్యా (28)అనే వ్యక్తి మత్తిలికి వెళ్తున్నాడు. అదే సమయంలో నాయిక్‌గూఢ వద్ద ఎదురుగా వస్తున్న పికప్ వ్యాన్ అతడిని బలంగా ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే గ్రామస్తులు బాధితుడికి న్యాయం జరగాలని రహదారి వద్ద ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులతో చర్చించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులుకు అప్పగించారు. కేసు నమోదు చేసిన పోలీసులు డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

ఎలక్ట్రికల్ సామగ్రి చోరీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల నిర్మిత కేంద్రంలో గృహ నిర్మాణ శాఖ నిల్వ ఉంచిన రూ.1.30 లక్షల విలువైన ఎలక్ట్రికల్ సామగ్రి చోరీకి గురైంది. ఈ మేరకు మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ ఉరిటి రాజేంద్ర ప్రసాద్ ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని జేఆర్‌పురం సీఐ ఆదాం, ఎచ్చెర్ల ఎస్సై సత్యనారాయణ, క్లూస్ టీం బృందం బుధవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. జగనన్న కాలనీల్లో నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు సర్వీస్ వైర్, మీటర్ భద్ర పర్చే బాక్సులు, ఇతర సామగ్రి ఇక్కడ నిల్వ ఉంచారు. తలుపుల తాళాలు తొలగించి ఈ చోరీకి పాల్పడ్డారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యం

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ ప్రయాణికులు నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులు, డ్రైవర్లు, కండక్టర్లకు ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ బాషా, ఆర్టీసీ అధికారులు నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించారు. టికెట్ చార్జీలను యూపీఐ విధానంతో పాటు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా చెల్లించవచ్చన్నారు. దూరప్రాంత ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్, రెండో డిపో మేనేజర్ కేఆర్ఎస్ శర్మ, కోర్ గ్రూప్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, శ్రీకాకుళం ఒకటో డిపో సిస్టం సూపర్‌వైజర్ ఇబ్రహీం, రెండో డిపో సిస్టం సూపర్‌వైజర్ హైమావతి పాల్గొన్నారు.

'విజయకేతనం ఎగురవేయాలి'



సమావేశంలో పాల్గొన్న బీజేడీ నాయకులు

జయపురం: రానున్న ఎన్నికల్లో జయపురం శాసన సభ, పార్లమెంట్ స్థానాల్లో విజయకేతనం ఎగురవేయాలని కొరాపుట్ జిల్లా బీజేడీ పర్యవేక్షకుడు హరి శంకర రౌత్ పిలుపునిచ్చారు. స్థానిక ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో బిజు యువ జనతా, ఛాత్ర జనతా విభాగాలతో జిల్లా యువ బీజేడీ అధ్యక్షుడు లలాట కేశరి సెట్టి, ఛాత్ర బీజేడీ అధ్యక్షుడు ఆశిష్ పండల అధ్యక్షతన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం నవీన్ పట్నాయక్ పవనాలు వీస్తున్నప్పటికీ, జయపురంలో బీజేడీ ఓటమి పాలవుతోందని గుర్తు చేశారు. గత రెండు ఎన్నికల్లోనూ ఇక్కడ ఓటమి చెందడంపై సమీక్షించుకోవడం అవసరమన్నారు. అందరు సమష్టిగా పనిచేస్తే విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. పార్టీలో పెద్ద సమస్య ఎదురైతే వాటిని రాష్ట నేతలతో చర్చించాలని హితవు పలికారు. రానున్న ఎన్నికలలో పార్టీ విజయానికి బిజు యూత్ బీజేడీ, ఛాత్ర బీజేడీలు ప్రధాన భూమిక పోషించాలని సూచించారు. ప్రతీ పంచాయతీలో 20 మంది యువత, 20 మంది విద్యార్థులు కమిటీగా ఏర్పడి వార్డుల నుంచి పంచాయతీల వరకు బాధ్యతలు చేపట్టాలన్నారు. సమావేశంలో మాజీ మంత్రి రబినారాయణ నందో, జిల్లా బీజేడీ అధ్యక్షుడు ఝిన్నా హికాక, రాష్ట బీజేడీ సాధారణ కార్యదర్శి ఈశ్వర చంద్ర పాణిగ్రహి, జిల్లా బీజేడీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంత గుప్త, సీనియర్ నేతలు అనూప్ పాత్రో, రమాకాంత రౌళొ, విష్ణు ప్రసాద్ పాత్రో, సూర్యనారాయణ రథ్, దుర్గ మిశ్ర, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బి.సునీత తదితరులు పాల్గొన్నారు.

పేపర్ మిల్లు తెరవాలని రాస్తారోకో



ఆందోళన చేపడుతున్న పేపరు మిల్లు తదితర సంఘాల కార్మికులు

జయపురం: స్థానిక సేవా పేపరు మిల్లు తెరవాలని సేవా పేపరు మిల్లు శ్రామిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జయపురం ప్రధాన కూడలి వద్ద సంయుక్త కార్యాచరణ కమిటీ, జయపురం సిటీ కో-ఆర్డినేషన్ కమిటీ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. వెంటనే పేపరు మిల్లు పునః ప్రారంభించాలని, శ్రామికుల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ముడిసరుకు కొరత కారణంగా జూలై 14వ తేదీ నుంచి మిల్లులో పేపరు ఉత్పాదన నిలిచిపోయిందని, మిల్లు ఎప్పుడు తెరుస్తారో యాజమాన్యం చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా పర్మినెంట్ శ్రామికులకు, నాలుగు నెలలుగా కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డు శ్రామికులకు జీతాలు చెల్లించడం లేదని వాపోయారు. విశ్రాంత, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు పీఎఫ్, గ్రాట్యుటీ చెల్లించకపోవడం వలన అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు. 15 రోజుల్లోగా మిల్లు తెరవడంతో పాటు సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. త్వరలో జరగనున్న విధానసభ సమావేశాల సందర్భంగా భువనేశ్వర్‌లో ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ఆందోళనలో కార్మిక నేతలు ప్రమోద్ కుమార్ మహంతి, నళినీ రథ్, కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి జుధిష్టర్ రౌళో, ప్రదీప్ పంజియ, బనమాలి పాత్రో, కేదార్ ఆచార్య, కేదార్ మహాపాత్రో, రవీంద్ర రౌత్, సుదర్శన బిశాయి తదితరులు పాల్గొన్నారు.

రాయగడలో రైల్వే డీఆర్ఎం పర్యటన



డీఆర్ఎంకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

రాయగడ: విశాఖపట్నం రైల్వే డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ బుధవారం రాయగడలో పర్యటించారు. తూర్పుకోస్తా రైల్వే డీఆర్ఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మొదటిసారిగా రాయగడకు రావడంతో రైల్వే అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కొత్తగా నిర్మించిన రైల్వే భవనం, ట్రాక్‌ల నిర్మాణ పనులు తనిఖీ చేశారు. త్వరలో రాయగడ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే కోచ్ రెస్టారెంట్ ప్రారంభించనున్నట్లు తెలియజేశారు.

ముద్ర యోజనలో రుణాలకు హామీ



బ్యాంక్ మేనేజర్‌తో చర్చిస్తున్న ప్రభాకర్ తదితరులు

జయపురం: ముద్ర యోజనలో వ్యాపారులకు రుణాలు ఇస్తామని స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ రశ్మిరంజన్ సున హామీ ఇచ్చారు. ముద్ర యోజనపై చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్‌కు మధ్య చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ మాట్లాడుతూ.. వ్యాపారులకు ఎటువంటి గ్యారెంటీ లేకుండా రూ.10 లక్షల వరకు రుణం మంజూరు చేస్తామన్నారు. తమ బ్యాంక్ నుంచి ఋణాలు తీసుకునేందుకు ఉత్సాహం చూపే వ్యాపారుల జాబితాను తమకు సమర్పించాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వి.ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. రుణాలు తీసుకునేందుకు ముందుకొచ్చే వ్యాపారుల జాబితా అందిన తర్వాత మరో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. చాంబర్ అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ రుణాలు ఇచ్చేందుకు ముందుకొచ్చిన యూనియన్ బ్యాంక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. చర్చల్లో చాంబర్ ఉపాధ్యక్షుడు నొరి మహంతి తదితరులు పాల్గొన్నారు.

'బాలల కోసం ఒక రోజు'పై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పర్లాకిమిడి: జిల్లా శిశు సురక్షా కేంద్రం ఆధ్వర్యంలో 'బాలల కోసం ఒక రోజు' అనే కార్యక్రమంపై బుధవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లాలో అనాథ బాలల సంరక్షణ, ఉన్నత విద్యపై సమీక్షించారు. బాల్య వివాహాలు, దత్తత, బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు పంచాయతీ స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. ఈ విద్యా సంవత్సరంలో (2022-23) పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన బాలలకు రూ.4 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్‌కే దాస్, జిల్లా శిశు సురక్షాధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, జిల్లా శ్రమ అధికారి లోకనాథ పండా, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, కాశీనగర్ ఎన్ఏఈ చైర్మన్ మేడిబోయిన సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

రెండు దోపిడీ ముఠాలు అరెస్టు



అరెస్టు చేసిన నిందితులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: గంజాం జిల్లా చికిటి బ్లాక్ పత్రపూర్ గ్రామంలోని ఒక కాంట్రాక్టర్ ఇంటిలో జరిగిన దోపిడీ ఘటనలో నలుగురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి బసంత్‌కుమార్ సెఠి మంగళవారం తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల పత్రపూర్ గ్రామంలోని కాంట్రాక్టర్ ప్రమోద్‌కుమార్ పాణిగ్రాహి ఇంటి గేట్ పగలుగొట్టి దోపిడీ దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. అనంతరం బీరువాలోని బంగారు ఆభరణాలు, రూ.25 వేల నగదు దోచుకొని పరారయ్యారు. ఘటనపై బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టి నలుగురిని అరెస్టు చేశారు. వారివద్ద నుంచి 35.290 గ్రాముల బంగారం కడ్డి, 2 సెల్‌ఫోన్లు, 2 ఏటీఎం కార్డులు, 2 ద్విచక్ర వాహనాలు, 2కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

బంజనగర్‌లో...

అలాగే గంజాం జిల్లా బంజనగర్ పోలీసుస్టేషన్ పరిధి బట్టకుమడా గ్రామంలోని ఇంటిలో జరిగిన దొంగతనం కేసులో మరో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నగదు, ల్యాప్‌టాప్, మొబైల్స్, ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు ఐఐసీ కౌసిక్ మజ్జి తెలియజేశారు.



బంజనగర్ పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

అక్రమాలపై విజిలెన్స్‌కు ఫిర్యాదు



విజిలెన్స్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మలదా గ్రామ ప్రజలు



ఎస్పీ వేణుధరకి సమస్యలు వివరిస్తున్న జుధిష్టర్ రౌళో తదితరులు

జయపురం: కొరాపుట్ జిల్లా మలదా గ్రామ పంచాయతీలో అక్రమాలు తారాస్థాయికి చేరాయని కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఆరోపణలు చేశారు. ఈ మేరకు స్థానిక ప్రజలతో కలిసి విజిలెన్స్ ఎస్పీ వేణుధరకి బుధవారం ఫిర్యాదు చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జుధిష్టర్ రౌళో నాయకత్వంలో మలదా పంచాయతీ ప్రతినిధులు జయపురంలోని విజిలెన్స్ ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అక్రమాలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. పంచాయితీలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మదలా నుంచి హటిగాం గ్రామం వరకు వేసిన ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన రోడ్డులో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, గ్రామంలోని చెరువు పూడిక తీయకుండా బిల్లులు చేసుకున్నారని తెలిపారు. అలాగే పాఠశాలలో 5టీ పథకంలో భాగంగా 19 నిర్మాణ పనులు చేయాల్సి ఉండగా, కేవలం 6 పనులు మాత్రమే చేసి మిగతా డబ్బు స్వాహా చేశారన్నారు. దీనిపై దర్యాప్తు జరిపి తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతు నాయకుడు నిత్యానంద పాత్రో తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్. పక్కన జేడీ సురేష్‌బాబు

శ్రీకాకుళం క్రైమ్ : రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతన్నలకు అందించే ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల అమ్మకాల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడకూడదని జిల్లా ప్రాంతీయ నిఘా, అమలు అధికారి (విజిలెన్స్ జేడీ) ఎ.సురేష్‌బాబు అన్నారు. బుధవారం శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో వ్యాపారులు, వివిధ కంపెనీల ప్రతినిధులతో విజిలెన్సు, వ్యవసాయ శాఖల అనుసంధానంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో ఎరువులు అందేలా చూడాలన్నారు. నిబంధనలను అతిక్రమించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ మాట్లాడుతూ రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీఎస్పీ కిరణ్‌కుమార్, వ్యవసాయాధికారులు, వర్తకులు పాల్గొన్నారు.

తీరం..అల్లకల్లోలం



కోతకు గురైన మంచినీళ్లపేట సముద్ర తీరం

వజ్రపుకొత్తూరు: మండలంలోని సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. అలల పోటు ఎక్కువ కావడంతో మంచినీళ్లపేట, దేవునల్తాడ తీరంలో సముద్రం దాదాపు 120 మీటర్లు మేర ముందుకు వచ్చిందని మత్స్యకారులు చెబుతున్నారు. బంగ్లాదేశ్‌లోని ఖేపుపరా వద్ద వాయుగుండం తీరం దాటడంతో మూడు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో తీరంలో అలజడి ఎక్కువైంది. ఇసుక దిబ్బలు దాదాపు 2 కి.మీ. మేర కోతకు గురయ్యాయి. దేవునల్తాడ. అక్కుపల్లి, దిబ్బవానిపేట, కేఆర్‌పేట తదితర రేవుల్లో తీరం కోతకు గురైంది. దీంతో ఆయా ప్రాంతాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లడం లేదు.

పేదలకు ఉచిత న్యాయసేవలు



సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదులకు ఫీజు చెల్లించుకోలేని పేదలు ఈ-లీగల్ ఎయిడ్ డిఫెన్సు కౌన్సిల్ ద్వారా ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం మొదటి అంతస్తులో ఈ- లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సెంటర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేని వారికి న్యాయవాదులు చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ కొమరా ఆఫీస్, డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పుట్టా అంజనీకుమార్, అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పైడి హర్షవర్ధన్ ద్వారా కేసు నడిపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు శ్రీదేవి, భాస్కరరావు, ఫణి కుమార్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.అనూరాధ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, కార్యదర్శి పొన్నాడ రాము తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి సౌర విద్యుత్


ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్‌కు సౌర విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు చెప్పారు. 750 కిలో వాట్స్ విద్యుత్ సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు బుధవారం నెడ్‌క్యాప్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యుత్ ఆదా చేయటంలో భాగంగా సౌర విద్యుత్‌పై దృష్టి పెట్టినట్లు చెప్పారు. వర్సిటీలో భవిష్యత్తులో 6400 మంది విద్యార్థులు ఉంటారని, టీచింగ్, నాన్ టీచింగ్ సైతం వేల సంఖ్యలో ఉంటారని అన్నారు. అన్ని బ్లాక్‌లకు సౌర విద్యుత్ సరఫరా లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. నెడ్‌క్యాప్ సంస్థ ప్రతినిధి నాగార్జున రెడ్డి, ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

పెరుగుతూ.. తగ్గుతూ..



సరుబుజ్జిలి: తెలికిపెంట బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంశధార నది

- వంశధార గొట్టాబ్యారేజీ వద్ద పెరిగిన వరద
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- సాయంత్రానికి తగ్గుముఖం
- గొట్టాబ్యారేజీని పరిశీలించిన వంశధార అధికారులు



హిరమండలం: బ్యారేజీ నుంచి దిగువకు విడిచిపెడుతున్న వరదనీరు

హిరమండలం: హిరమండలంలోని వంశధార గొట్టాబ్యారేజీలో వరద నీరు బుధవారం ఉదయం ఒక్కసారిగా పెరిగింది. ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాలో మూడు రోజులుగా పడుతున్న వర్షాలకు వంశధారలో భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. గొట్టాబ్యారేజీ వద్ద 38.10 మిల్లీలీటర్ల నీటిమట్టం ఉంది. మంగళవారం రాత్రికి సుమారు 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా బుధవారం ఉదయం 7 గంటలకు 35,355 క్యూసెక్కులకు చేరింది. 8 గంటల సమయంలో 41,934 క్యూసెక్కులకు పెరగడంతో వంశధార అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. మధ్యాహ్నం వరకు 40 వేల క్యూసెక్కుల మేర వరద వచ్చి చేరింది. వచ్చిన నీటిని 18 గేట్లను 50 సెంటీమీటర్లు మేర పైకి ఎత్తి దిగువకు విడిచిపెట్టినట్లు డీఈ అనిల్‌కుమార్ తెలిపారు. కుడి ప్రధాన కాలువ ద్వారా 403 క్యూసెక్కులు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1347 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టామని చెప్పారు. సాయంత్రానికి వరద తగ్గుముఖం పట్టిందన్నారు. సాయంత్రం 4 గంటలకు 30780 క్యూసెక్కులు, ఐదు గంటలకు 28,283 క్యూసెక్కులు, సాయంత్రం ఆరుగంటలకు 27,979 క్యూసెక్కులకు వరద తగ్గినట్లు డీఈ వివరించారు. వరద పరిస్థితిని వంశధార ఈఈ డీఎస్ ప్రదీప్, డీఈ అనిల్‌కుమార్, ఏఈఈలు ధనుంజయరావు, పరిశుద్ధబాబు, పి.శ్రీవాని పరిశీలించారు. ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాలో కాత్రగడ వద్ద 68.2 మిల్లీ మీటర్లు, గుడారి వద్ద 58.4 మిల్లీమీటర్లు, మోహన్ వద్ద 34 మిల్లీ మీటర్లు, గుణుపూర్ వద్ద 29.8 మిల్లీమీటర్లు, మహేంద్రగడలో 16.8 మిల్లీమీటర్లు, కాశీనగర్ 15.8 మిల్లీ మీటర్లు, మెళియాపుట్టి వద్ద 3.6.మిల్లీ మీటర్లు, గొట్ట వద్ద 6.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు డీఈ వివరించారు.

క్లుప్తంగా

నేడు పార్వతీపురం మన్యం జిల్లాలో ఏజెన్సీ బంద్


మాట్లాడుతున్న గిరిజన, ఆదివాసీ సంఘాల నాయకుడు మండంగి లక్ష్మణరావు

పార్వతీపురంటౌన్: మణిపూర్‌లో ఆదివాసీలపై 3 నెలలుగా సాగుతున్న దాడులకు నిరసనగా గురువారం పార్వతీపురం మన్యం జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలో బంద్‌కు పిలుపునిస్తున్నట్లు గిరిజన, ఆదివాసీ సంఘాల నాయకులు మండంగి లక్ష్మణరావు, కోలక అవినాష్‌లు తెలిపారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంద్‌కు అందరూ సహకరించాలని కోరారు. మణిపూర్ ఆదివాసీలపై కార్పొరేట్, మతోన్మాద శక్తుల పైశాచిక మారణహోమాన్ని ఖండిస్తున్నామన్నారు. బంద్ పిలుపుతో పోలీస్ యంత్రాగం అప్రమత్తమై భద్రతను, కట్టుదిట్టం చేయాలని నిర్ణయించింది. కార్యక్రమంలో చివరావు అప్పారావు, సీతారాం, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ


గ్రామస్తులతో మాట్లాడుతున్న వైద్యాశాఖాధికారులు

మక్కువ: మండలంలోని నంద గ్రామానికి చెందిన పదవతరగతి విద్యార్థి బిడ్డిక మహేంద్ర జర్వంతో మృతిచెందడంతో, బుధవారం జిల్లా మలేరియాఅధికారి శ్యామ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటరమణలు గ్రామంలో విచారణ చేపట్టారు. మహేంద్ర కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆరోగ్యపరంగా ఏవిధమైన బయాందోళన చెందాల్సిన అవసరంలేదని, వైద్యసిబ్బంది వెన్నంటి ఉంటారని గ్రామస్తుల కు ధైర్యం చెప్పారు. గ్రామస్తుల వ్యాధుల బారిన పడితే ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయించకుండా, ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని వైద్యసేవలు పొందాలని హితవు పలికారు. గ్రామంలో పర్యటించి ఏఎల్‌వో స్ప్రేయింగ్, ఎంసీటీ కార్యక్రమం, ఇంటింటా జ్వరాల సర్వే జరిగిందా, లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ముమ్ముందు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని శంబర పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు. అనంతరం ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు.

ఐడీడీఏ పీఓ సుడిగాలి పర్యటన


తోణాం పీహెచ్‌సీలో వైద్యాధికారిణితో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: పట్టణం, మండలంలో ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ మేరకు మండలంలోని తోణాంలో బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఓటరు సర్వేను పరిశీలించారు. నియమనిబంధనలకు అనుగుణంగా సర్వే చేయాలని స్పష్టం చేశారు. సమగ్ర ఓటరు జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం తోణాం పీహెచ్‌సీని తనిఖీ చేసి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి చికిత్సా విధానం, సదుపాయాలపై ఆరా తీశారు. ఓపీ గురించి వైద్యురాలిని అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రి భవనం, ఆశ్రమపాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి అందుతున్న సదుపాయాలు, అభ్యసనాపద్ధతుల గురించి తెలుసుకున్నారు. పట్టణ సమీపంలోని నెలిపర్తి జగనన్న కాలనీని సందర్శించి సెప్టెంబరు 15 నాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటరమణ, తహసీల్దార్ బాలమురళీకృష్ణ, కమిషనర్ శంకర రావు తదితరులు ఉన్నారు.

విద్యుత్ అనధికార కనెక్షన్‌తోనే ప్రమాదం

బాడంగి: మండలంలోని పూడివలసలో మంగళవారం జరిగిన వేతనదారుల మృతికి గ్రామానికి చెందిన రైతు సత్యం వ్యవసాయబావి మోటార్‌కు దొంగతనంగా వాడిన విద్యుత్‌కనెక్షన్ కారణమని పోలీసులు నిర్ధారించారు. ఆ రైతు కొన్నేళ్లుగా విద్యుత్ అక్రమ కనెక్షన్ కలిగి ఉన్నప్పటికీ ఆ శాఖ సిబ్బంది పట్టించుకోకపోవడం కూడా ఇందుకు మరోకారణంగా భావించి రైతు సత్యం తో పాటు సంబంధిత గ్రామ లైన్‌మన్ ఏసుపై కేసు నమోదుచేశారు. ఏడాదికాలంగా ఆ సర్వీస్ వైరును రైతు వాడకపోవడంతో జీఐ వైరు తెగిపోయి విద్యుత్‌వైర్లపై నుంచి నేలకు వేలాడడంతో ప్రమాదం జరిగినట్లు మృతుల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఆర్.జయంతి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అప్పల నాయుడు, రామమూర్తిల మృతదేహాలకు సీహెచ్‌సీ వైద్యులు బుధవారం పోస్ట్‌మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

అవినీతి పరులకు గుండెదడ..!

- జోరు పెంచిన ఏసీబీ
- టోల్ ఫ్రీ 14400, యాప్‌తో సత్వర పరిష్కారం
- లైవ్ రిపోర్ట్‌తో అక్కడికక్కడే ఫిర్యాదు చేసే అవకాశం



ప్రభుత్వ కార్యాలయాల వద్ద 14400 యాప్‌పై పోస్టర్లు అతికిస్తున్న ఏసీబీ అధికారులు


ఏసీబీ కార్యాలయం

విజయనగరం క్రైమ్: అవినీతిని అంతమొందించడమే ఏసీబీ లక్ష్యం. దాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ 14400, యాప్‌ను రూపకల్పన చేసింది. అవినీతికి పాల్పడుతున్న వారి సమాచారాన్ని ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న ప్రతి ఒక్కరూ నేరుగా యాప్‌లో తెలియజేయవచ్చు. రాష్ట్రస్థాయిలోనే ఏసీబీ ఉన్నతాధికారులకు లైవ్ రిపోర్టుతో అక్కడికక్కడే ఫిర్యాదుచేసే వెసులుబాటు ఉంది. దీంతో సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత ఏసీబీ అధికారులకు అవకాశం కలుగుతుంది. ప్రస్తుతం రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వీఆర్ఓ స్థాయి అధికారుల్లో అవినీతికి పాల్పడే వారిని ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకుంటున్నారు. కలెక్టరేట్ అయినా, ఆర్డీఓ కార్యాలయమైనా, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, మండల కార్యాలయం, పోలీస్ స్టేషన్, వలంటీర్లు, సచివాలయం, 108, 104 సర్వీసులైనా ఎవరైనా సరే లంచం అడిగితే వెంటనే మొబైల్‌లో ఏసీబీ టోల్ ఫ్రీ 14400, యాప్‌లో బటన్ నొక్కి వీడియో కానీ, ఆడియో కానీ సంభాషణ రికార్డు చేసి పంపడమే తరువాయి డేటా నేరుగా ఏసీబీ సీఎంఓకు నివేదిస్తుంది.

ఫిర్యాదు చేసిన తక్షణమే చర్యలు

లంచం అడిగిన ప్రభుత్వ అధికారులపై ఏసీబీ నిఘా విస్తృతం చేసింది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఏసీబీ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. వారి నంబర్లను అందజేస్తున్నారు. అక్షరాస్యత ఉన్న వారంతా మొబైల్స్‌లో గూగుల్ ప్లే స్టోర్‌లో 14400 యాప్ ద్వారా ఫిర్యాదుచేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. యాప్ ద్వారా ఎవరైనా లైవ్ స్ట్రీమింగ్, ఆడియో, వీడియో రికార్డు చేసి ఫిర్యాదు చేయవచ్చు. అవినీతికి పాల్పడుతున్న అధికారి పేరు, శాఖ వివరాలను పొందుపరిచి పంపితే, తక్షణమే అవినీతి నిరోధక శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారు.

యాప్ సద్వినియోగం ఇలా..

గూగుల్ ప్లే స్టోర్‌లో ఏసీబీ 14400 యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని నమోదుచేయడం ద్వారా వినియోగానికి సిద్ధంగా ఉంటుంది. అవినీతి వ్యవహారాలకు సంబంధించిన ఆడియో, వీడియో, ఫొటోలను నేరుగా లైవ్ రిపోర్ట్ ఫీచర్ వినియోగించుకుని అక్కడికక్కడే ఫిర్యాదుచేసే అవకాశం ఉంది.

- లాడ్జ్ కంప్లైంట్ ఫీచర్ ద్వారా తమ దగ్గరున్న డాక్యుమెంట్లు, వీడియో, ఆడియో ఫొటో ఆధారాలను ఏసీబీకి పంపించవచ్చు.
- ఫిర్యాదు రిజిస్టర్ చేయగానే మొబైల్ ఫోన్‌కు రిఫరెన్స్ నంబర్ వస్తుంది.

ఇప్పటివరకూ నమోదైన కేసుల వివరాలు



ప్రజల నుంచి స్పందన బాగుంది ఏసీబీ టోల్ ఫ్రీ 14400, యాప్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి. లంచం అడిగే వారిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన యాప్ ద్వారా కొరడా ఝుళిపించండి. ఇప్పుడు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి రసీదుపైనా ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ ఉండడం ఎంతో ఉపయోగకరంగా మారింది. బాధితులు యాప్‌తో పాటు ఏసీబీ డీఎస్పీ ఫోన్ 9440446174 నంబర్‌కు ఫిర్యాదుచేయవచ్చు. లేదా నేరుగా కార్యాలయానికి వచ్చి కలవవచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. ప్రజలకు ఒక్క ఫోన్ కాల్‌తో సమస్య పరిష్కారమవుతుంది.

–పాత్రుని రామచంద్రరావు, ఏసీబీ డీఎస్పీ, విజయనగరం

అర్హత ఉన్న పేదలందరికీ పట్టాలు


లబ్ధిదారులకు ఇంటిస్థలం పట్టాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఇంటి స్థలం పట్టాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రావివలస గ్రామానికి చెందిన 14 మంది, గత్సలవలస గ్రామానికి చెందిన 14 మంది లబ్ధిదారులకు ఇంటి స్థల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి స్థలం లేని పేదలు దరఖాస్తు చేసుకుంటే అర్హతలు పరిశీలించి 90 రోజుల్లో ఇంటి స్థలం పట్టాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో ఇంటి స్థలం పట్టా కావాలంటే నెలలు, సంవత్సరాలు వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో ఇంటి స్థలం పట్టా ఇవ్వాల్సిందేనన్నారు. అర్హత ఉంటే ఎవరి పైరవీలు లేకుండానే పట్టాలు మంజూరవుతాయని స్పష్టం చేశారు. అర్హత ఉండి ఇంటిస్థలం లేని పేదలు ఇంకా ఉంటే తక్షణమే తమ గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పనస అప్పారావు, కొమ్ము చిరంజీవి, తహసీల్దార్ ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో పాడి ఆవు మృతి

- మరో రెండు ఆవులకు తీవ్రగాయాలు
- నాశనమవుతున్న పంటలు



ఏనుగుల దాడిలో మృతిచెందిన ఆవు


ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఎస్సై ఆర్.జనార్దన సిబ్బంది

వంగర: మండలంలోని సంగాం గ్రామంలో ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టిస్తోంది. వారం రోజులుగా ఎనిమిది ఏనుగుల గుంపు గ్రామంలో తిష్ఠవేసింది. బుధవారం వేకువజామున ఆవులపై దాడి చేయడంతో బొడ్రోతు రామునాయుడుకు చెందిన పాడిఆవు మృతిచెందగా, వావిలపల్లి జగన్నాథం నాయుడు, ఆలుబిల్లి ఈశ్వరరావుకు చెందిన ఆవులు తీవ్రంగా గాయపడ్డాయి. రైతుల పొలాల్లో వరి, మొక్కజొన్న, చెరకు పంటలను నాశనం చేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఏనుగులు పంటలకు తీవ్రనష్టం కలిగించాయని, తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తమ గ్రామాల సమీపంలోకి ఏనుగుల గుంపు వస్తోందని సంగాం, మగ్గూరు, ఓనెఅగ్రహారం గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తహసీల్దార్ డి.ఐజాక్, ఎస్సై ఆర్.జనార్దన రావు, ఏనుగులు తిష్ఠ వేసే ప్రదేశాలను పరిశీలించి ప్రజలకు సూచనలు చేశారు. అటవీశాఖ సిబ్బంది, ఎలిఫెంట్ ట్రాకర్స్ ఎప్పటికప్పుడు గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

- కుమార్తె వివాహానికి డబ్బులు సమకూరలేదని మనస్తాపం


ఆత్మహత్యకు పాల్పడిన బంగారి

గంట్యాడ: మండలంలోని గింజేరు గ్రామానికి చెందిన వెలుదూటి బంగారి(57) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈనెల 24వతేదీన ఆయన కుమార్తెకు వివాహం జరగనుంది. ఈ నేపథ్యంలో వివాహానికి సంబంధించి డబ్బులు సమకూరలేదని మనస్తాపం చెంది ఇంట్లో తువ్వాలుతో ఉరేసుకున్నాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాంబాబు తెలిపారు.

విద్యుదాఘాతంతో గిరిజన మహిళ మృతి


విద్యుత్ షాక్‌తో మృతిచెందిన లలిత

సీతంపేట: మండలంలోని దోనుబాయి పోలీస్‌స్టేషన్ పరిధి వెలగాపురం గ్రామానికి చెందిన ఆరిక లలిత (25)విద్యుదాఘాతానికి గురై బుధవారం మృతిచెందింది. ఇంట్లో వేడినీరు కాచేందుకు బకెట్లో ఆమె హీటర్ పెట్టింది. నీళ్లు కాగాయా లేదో తెలుసుకునేందుకు స్విచ్ ఆఫ్ చేయకుండా బకెట్‌లో చేయి పెట్టడంతో ప్రమాదం సంభవించింది. కొన ఊపిరితో ఉన్న ఆమెను స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి భర్త రాజేంద్రప్రసాద్, రెండున్నరేళ్ల కుమారుడు ప్రేమసాగర్ ఉన్నారు. ఫిర్యాదు మేరకు దోనుబాయి స్టేషన్ ఏఎస్సై త్రినాథరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

4న అప్రెంటిస్ మేళా

విజయనగరం రూరల్: హైదరాబాద్‌లోని మేధో సర్వో డ్రైవ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అప్రెంటిస్ నియామకాలకు ఈ నెల 4న మేళా నిర్వహిస్తున్నట్లు విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టీవీ గిరి బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని వీటీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించే అప్రెంటిస్ మేళాకు వివిధ ట్రేడ్‌లలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. అభ్యర్థుల వయస్సు 25 ఏళ్ల లోపు ఉండాలని తెలిపారు. ఎలక్ట్రీషియన్ 300, ఫిట్టర్ 300, ఎలక్ట్రానిక్ మెకానిక్ 100, వెల్డర్ 25 పోస్టులకు అప్రెంటిస్‌కు ఎంపిక చేస్తారని తెలిపారు. శిక్షణ కాలంలో స్టైపెండ్ నెలకు రూ.13500, ఈఎస్ఐ, ఓటీ, యూనిఫాం, షూ ఇస్తారని చెప్పారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫారం, 10వ తరగతి మార్కుల జాబితా, ఐటీఐ ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో అప్రెంటిస్ మేళాకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9849944654, 8985054780 నంబర్లను సంప్రదించాలని వివరించారు.

చెరువులో చేపలు మృతి


చెరువులో తేలిన చేపలను చూపిస్తున్న సహకార సంఘం సభ్యుడు కొమ్ము వెంకటరమణ

కొమరాడ: మండలంలోని మాదలింగి గ్రామంలో గల ఊర చెరువులో విషపదార్థాలు కలవడం వల్ల చేపలు మృతి చెందినట్లు గ్రామ సర్పంచ్ తుమరాడ కళావతి, శ్రీ రాజీవ్ గిరిజన మత్స్య పారిశ్రామిక సహాయక సహకార సంఘం సభ్యుడు కొమ్ము వెంకటరమణ బుధవారం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్లవారు జామున చెరువు వద్దకు వెళ్లే చూసేసరికి వేలాది రూపాయల విలువ చేసిన చేపలు మృతి చెంది నీటిపై తేలి ఉన్నాయన్నారు. 2006లో గిరిజనులంతా కలిసి ఒక సహకార సంఘంగా ఏర్పడి చెరువును గ్రామ పంచాయతీ నుంచి లీజుకు తీసుకుని చెరువులో చేపలు విడిచిపెట్టి వాటిపై వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నామన్నారు. ఇప్పుడు చేపలు చనిపోవడంతో జీవనాధారం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చెరువులో చేపలకు విషపదార్థాలు విడిచిపెట్టిన వారిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే శ్రీ రాజీవ్ గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు అప్పన్న దొర మాట్లాడుతూ చెరువుపైన ఉన్న పొలాల రైతులు పురుగు, కలుపు మందులు చల్లడం వల్ల చేపలు మృతి చెందాయన్నారు.

ఆటోను పాల వ్యాన్ ఢీకొని ఐదుగురికి గాయాలు

రామభద్రపురం: మండలంలోని రొంపల్లి, ఎస్ సీతారాంపురం జంక్షన్ వద్ద బుధవారం ఆటోను పాల వ్యాన్ ఢీ కొట్టడంతో ఐదుగురు వ్యక్తులు స్వల్ప గాయాలపాలయ్యారు. రామభద్రపురం నుంచి బొబ్బిలి వెళ్తున్న అదే మార్గంలో పాల వ్యాన్ ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న అప్పలరాజు గ్రామానికి చెందిన అల్లాడ యల్లమ్మ, వేరే గ్రామాలకు చెందిన ఉషారాణి, సన్యాసమ్మ, చిన్నమ్మ, వెంకటరమణలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు బాధితులను ప్రథమ చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదుమేరకు ఎస్సై సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం


జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వర రావు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్ లైఫ్ టైం అవార్డు-2023, వైఎస్సార్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్. వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, మెడిసిన్, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీసెస్, స్పోర్ట్స్ తదితర రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభా పాటవాలు చూపిన వ్యక్తులు దరఖాస్తుకు అర్హులని వివరించారు. ఉత్తమ సేవలు అందిస్తున్నప్పటికీ ప్రజా జీవనంలో కనిపించక అజ్ఞాత వ్యక్తుల్లా గ్రామాలు ఇతర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులు కూడా అర్హులని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, సంస్థలు, సొసైటీలు కూడా దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. వ్యక్తులు, సంస్థలు చేసిన పనిని ఒక పేజీలో క్లుప్తంగా తెలియజేస్తూ ఫోన్ నంబరు, ఈమెయిల్‌తో సహా పూర్తి వివరాలను సమర్పించాలని సూచించారు. క్రీడా రంగంలో గల ఆసక్తి, అర్హత గల వ్యక్తులు, సంస్థలు దరఖాస్తులను ఆగస్టు 20వ తేదీ లోగా సమర్పించాలని కోరారు.

108 జిల్లా మేనేజర్ బాధ్యతల స్వీకరణ


నజీర్ హుస్సేన్‌కు అభినందనలు తెలియజేస్తున్న 108, 104 సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంస్థ 108 విజయనగరం జిల్లా మేనేజర్‌గా నజీర్ హుస్సేన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా 108, 104 సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడ పనిచేసిన ఎస్.మన్మథనాయుడికి పార్వతీపురం మన్యం జిల్లా మేనేజర్‌గా బదిలీ అయింది. ఈ సందర్భంగా నజీర్ హుస్సేన్ మాట్లాడుతూ 108 అంబులెన్సుల ద్వారా మరింత మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని, ప్రభుత్వం ఏ లక్ష్యంతో అయితే అంబులెన్సులను ప్రవేశపెట్టిందో ఆ లక్ష్యాన్ని శతశాతం సాధించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వానికి మంచి గుర్తింపు తీసుకురావడానికి పాటు పడతానన్నారు. ఆయనకు అభినందనలు తెలిపిన వారిలో పార్వతీపురం మన్యం జిల్లా 108 మేనేజర్ ఎస్.మన్మథనాయుడు, విజయనగరం జిల్లా 104 మేనేజర్ బైరెడ్డి వినోద్‌కుమార్, 108 ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు, 108 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్ అవనాపు సాయి షణ్ముఖ, రవికుమార్ ఉన్నారు.

బంగారు తల్లి పల్లవి

- వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ కైవసం


పల్లవిని అభినందిస్తున్న సత్య కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బొత్స ఝాన్సీలక్ష్మి

విజయనగరం టౌన్: ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జూలై 28 నుంచి జరుగుతున్న ఏషియన్ యూత్ జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో సత్య కళాశాల విద్యార్థిని ఎస్. పల్లవి 64 కేజీల జూనియర్ విభాగంలో ఒక బంగారు పతకం, రెండు రజత పతకాలు సాధించింది. ఈ పోటీలో పల్లవి స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్-జర్క్‌లో 109 కేజీలు, మొత్తం 196 కేజీలు ఎత్తి పతకాలను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బొత్స ఝాన్సీలక్ష్మి, కళాశాల సంచాలకుడు డాక్టర్ ఎం శశిభూషణరావు, విద్యార్థినిని అభినందిస్తూ ధీర, సత్య విద్యాసంస్థల తరఫున పల్లవికి పౌష్టికాహారం నిమిత్తం గత ఆరు నెలలుగా నెలకు రూ.30వేల నగదు సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల కూడా రూ.30 వేల నగదును పల్లవి బ్యాంక్ అకౌంట్‌కు జమ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ పల్లవికి మంచి భవిష్యత్తు ఉందని, ఈ విధంగా భవిష్యత్తులో కూడా అంతర్జాతీయ స్థాయిలో బాగా రాణించి ఎన్నో బంగారు పతకాలను సాధించి దేశానికి రాష్ట్రానికి అలాగే విజయనగరం జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. కోచ్ చల్లా రాము మాట్లాడుతూ పల్లవి అంతర్జాతీయంగా పతకాలు సాధించడంలో సత్య విద్యాసంస్థల ఆర్థిక సహాయం ఎంతగానో తోడ్పడిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయి దేవమణి, వైస్ ప్రిన్సిపాల్ కెప్టెన్ సత్యవేణి అధ్యాపక, అధ్యాపకేతర బృందం పల్లవిని అభినందించారు.

కేజీబీవీల్లో టీచర్లను కొనసాగించాలి

- ఏపీటీఎఫ్ ఉమ్మడి జిల్లా కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: కేజీబీవీల్లో గెస్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కొనసాగిస్తూ తరువాత ఖాళీలను మాత్రమే కొత్తవారికి ఇవ్వాలని ఏపీటీఎఫ్ ఉమ్మడి విజయనగరం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో కమిటీ పేర్కొంది. కేజీబీవీల ప్రారంభం నుంచి పనిచేస్తున్న గెస్ట్ పీజీటీలకు, బోధనేతర సిబ్బందికి కనీస గౌరవేతనంతో పనిచేస్తూ..10వ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించిన అనుభవం ఉందన్నారు. నాలుగేళ్ల నుంచి ఉమ్మడి విజయనగరం జిల్లాలోని కేజీబీవీల్లో ఇంటర్‌మీడియట్ తరగతులకు బోధిస్తున్న పలువురు పీజీటీలను తిరిగి విధుల్లోకి తీసుకోకపోవడం విచారకరమన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న పలు పీజీటీ పోస్టులను వారితోనే భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ ఉమ్మడి విజయనగరం జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు, కార్యదర్శి కె.శ్రీనివాసన్ పాల్గొన్నారు.

విజయనగరం రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- అమృత్ భారత్ స్టేషన్స్ స్కీమ్‌తో ప్రయోజనం
- రూ.26 కోట్లతో ఆధునికీకరణ పనులు
- బొబ్బిలి, పార్వతీపురం, చీపురుపల్లి, కొత్తవలస స్టేషన్లకు స్కీమ్‌లో చోటు


విజయనగరం రైల్వేస్టేషన్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ, అదనపు హంగుల సమకూర్చాలనే లక్ష్యంతో రైల్వేశాఖ ప్రారంభించిన అమృత్ భారత్ స్టేషన్స్ స్కీమ్‌తో విజయనగరం రైల్వేస్టేషన్‌కు మహర్దశ రానుంది. సుమారు రూ.26 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు. దీర్ఘకాలిక ప్రాతిపదికన కొనసాగుతున్న స్కీమ్‌లో తూర్పు కోస్తా రైల్వే జోన్ నుంచి విజయనగరం సహా 15 రైల్వే స్టేషన్లను రైల్వే శాఖ ఎంపిక చేసింది. వాటిలో బొబ్బిలి జంక్షన్, పార్వతీపురం, చీపురుపల్లి, కొత్తవలస రైల్వేస్టేషన్లు కూడా ఉన్నాయి. ఈ స్కీమ్ ద్వారా ఒక మాస్టర్ ప్రణాళిక ప్రకారం రైల్వేస్టేషన్లలో వసతులను మెరుగుపర్చుతారు. భవనాలకు మెరుగులు దిద్దుతారు. ప్రయాణికులకు ఆధునిక వసతులను అందుబాటులోకి తీసుకొస్తారు. వెయిటింగ్ హాళ్లు, టాయిలెట్లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు తదితర సౌకర్యాలను మరింత మెరుగు పర్చనున్నారు. ఉచిత వైఫై, ప్రయాణికుల సమాచార వ్యవస్థలను విస్తృతం చేయనున్నారు. స్టేషన్ అవసరం, ప్రాధాన్యతను బట్టి ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు, బిజినెస్ మీటింగ్ హాళ్లనూ ఏర్పాటు చేస్తారు. ల్యాండ్ స్కేపింగ్ తదితర హంగులు రానున్నాయి. మౌలిక వసతుల అభివృద్ధిపై తూర్పు కోస్తా రైల్వే విభాగం ఇప్పటికే దృష్టి సారించింది. ఇటీవలే 25కి పైగా రైల్వే స్టేషన్లను యుద్ధప్రాతిపదికను అభివృద్ధి చేయడానికి రూ.547.7 కోట్లను వెచ్చించింది.

తోటపల్లికి వరదపోటు


తోటపల్లి ప్రాజెక్టువద్ద పరిస్థితి

పార్వతీపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు వద్ద నీటిప్రవాహం మరింత పెరిగింది. నాగావళి నదిలో తోటపల్లి ప్రాజెక్టువద్ద బుధవారం సాయంత్రం నాటికి 105 మీటర్లకు 104.40 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నదిలోకి 10,670 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, అధికారులు నాలుగు గేట్లను ఎత్తివేసి 11,381 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 2.5 టీఎంసీలు కాగా, 2.106 టీఎంసీలు నీరు నిల్వ ఉన్నట్టు ఏఈ కిషోర్ తెలిపారు. ప్రాజెక్టు వద్ద నీటి పరిస్థితిని ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పాత కుడి, ఎడమ కాలువలకు 290 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువకు 800 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. ఒడిశాలో కురుస్తున్న వర్షాల వల్ల నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరిగిందన్నారు.